


బైజూస్ సంస్థపై విద్యార్థి సంఘాల దాడి ముగ్గురు అరెస్ట్



ప్రజాశక్తి -తిరుపతి సిటీ తిరుపతి నగరంలోని బైజూస్ కోచింగ్ సెంటర్ కార్యాలయం పై కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు, దాడి చేయడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు వెస్ట్ పోలీసులు వెల్లడించారు. స్థానిక అన్నారావు సర్కిల్ సమీపంలోని బైజూస్ సంస్థ కార్యాలయం పై దాడిచేసి అందులోని ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వీడియోలు వైరల్ కావడంతో అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు ప్రత్యేక బందాలుగా ఏర్పడి, దాడికి పాల్పడిన మరికొందరి కోసం వెతుకులాట ప్రారంభించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

తిరుపతి కలెక్టరేట్ వద్ద బైఠాయింపు



'వణికించే'లా అంగన్ 'వేడి'

వేలాదిగా 'కలెక్టరేట్ బైఠాయింపు' హెచ్చరికల నోటీసులు దహనం
స్పందించకుంటే సిఎం ఇల్లు ముట్టడి శిబిరంలోనే సావిత్రిబాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

గత 23 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించడానికైనా వెనుకాడేది లేదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి హెచ్చరించారు. ఈనెల 5లోపు ఉద్యోగాల్లోకి రాకుంటే తొలగిస్తామని సిడిపిఒలు హెచ్చరికలు చేస్తున్నారని, అంగన్‌వాడీల తొలగింపు కథ ఎలా ఉన్నా, అధికార వైసిపి తొలగింపు ఖాయం అయ్యిందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో తాను చేసిన గొడవ కారణంగానే అంగన్‌వాడీల జీతాలు పెరిగాయని గతంలో డప్పాలు కొట్టిన ఆర్‌కె రోజా, ఇపుడు మంత్రిగా ఉండి సమస్య పరిష్కరించకపోగా సిడిపిఒ ద్వారా బెదిరించడం శోచనీయమన్నారు. స్పందించకపోతే రాష్ట్ర బంద్‌కు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర పిలుపులో భాగంగా తిరుపతి కలెక్టరేట్ ఎదుట వేలాది మంది అంగన్‌వాడీలతో బైఠాయింపు కిక్కిరిసింది. జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్ ప్రాంగణానికి ఉదయం 8 కల్లా అంగన్‌వాడీలు యూనిఫాంతో చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించిన బైఠాయింపు కార్యక్రమాన్ని సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయ గేటు వద్ద ప్రభుత్వం పంపిన హెచ్చరికల నోటీసులను దహనం చేశారు.

కార్యక్రమానికి పద్మలీల, ఎస్. వాణిశ్రీ (సిఐటియు), నాగరాజమ్మ (ఎఐటియుసి), ప్రియదర్శిని, భారతి (ఐఎఫ్టియు) లు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి కే. సుబ్రహ్మణ్యంలు ప్రసంగిస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తన వైఖరి విడనాడి అంగన్వాడీలకు న్యాయం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

వామపక్షాలు, ఐద్వా సంఘీభావం

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఆర్ .హరికష్ణలు అంగన్వాడి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. అవసరమైతే వెన్నంటి ఉంటామని, సమస్య పరిష్కారం అయ్యేవరకు కలిసి పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీలు సాగిస్తున్న పోరాటానికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. జయంతి, పి. సాయి లక్ష్మి లు హాజరై మద్దతు ప్రకటించారు.

బైఠాయింపు వద్ద ఆటా...పాటా

తిరుపతి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు , సెక్టార్ల నుంచి అంగన్వాడీలు 3500 మందికి పైగా కలెక్టరేట్ వద్ద బైఠాయింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్లు ఆయాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గౌరవ వేతనం మాకొద్దు, కనీస వేతనం కావాలి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని నినాదాలు చేశారు. 26 వేల కనీస వేతనాన్ని ఇవ్వాలని, గ్రాట్యుటీని అమలు పరచాలని డిమాండ్‌చేశారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

కలెక్టరేట్ వద్ద బైఠాయింపు కార్యక్రమంలోనే సావిత్రిబాయి పూలేకు నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ మహిళల చదువు కోసం ఎన్నో కష్టాలను ఎదుర్కొని సావిత్రిబాయి పూలే చదువుల తల్లిగా



అంగన్‌వాడీలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కందారపు మురళి

శ్రమించారన్నారు. ఆనాడు ప్రారంభించిన చదువునే ఇప్పటికీ అంగన్‌వాడీల్లో కొనసాగిస్తున్నామన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ఉద్యమాన్ని పట్టుదలగా కొనసాగిస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేఎన్‌ఎన్ ప్రసాదరావు, సిఐటియు నేతలు ఆర్ లక్ష్మి, మునిరాజా, టి. సుబ్రమణ్యం, కే. వేణుగోపాల్, బుజ్జి, గుణశేఖర్, ఓ.వి. రమణ, హరి, సెల్వరాజ్, శివప్రసాద్ రెడ్డి, కుమార్(విద్యుత్), గంగులప్ప, కళ్యాణ కట్ట ప్రసాద్, అంగన్‌వాడీ నాయకులు నాగరాజమ్మ, సుశీల, జయప్రభ, ఇంద్రాణి, ముని కుమారి, విజయ కుమారి, నిర్మల, హైమావతి, శ్యామలమ్మ, రాజేశ్వరిలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అంగన్వాడీ కార్యకర్తలు యూనియన్ నేతలు పాల్గొని ప్రసంగించారు.



యుటిఎఫ్ ధర్నాలోనే సావిత్రిబాయికి మహిళా టీచర్ల నివాళి

తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి

ప్రజాశక్తి - యంత్రాంగం

బిఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆమె జీవిత చరిత్రను కొనియాడారు. సావిత్రిబాయి పూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, ఉద్యమకారిణి అని, గొప్ప రచయిత్రి అని వివరించారు. తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ఆమె స్ఫూర్తితో మహిళలు ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాల్లో రాణించాలన్నారు.

- దొరవారిసత్రం చందనముడి గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటశేషయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చదువుతోనే మహిళలకు విముక్తి అని నమ్మి భర్తతో కలిసి 1848, జనవరి 1న పూణెలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.
- రేణిగుంటలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆషా అధ్యక్షులు జూలియన్‌రాజు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళా ఉపాధ్యాయులను ఆషా అధ్యక్షులు సన్మానించారు. మండల కోఆప్షన్ మెంబర్ హసన్‌సాహెబ్, సర్పంచి నగేషం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అన్నాస్వామిపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత గౌడ్, ఆషా సంస్థ కార్యదర్శి మునేంద్ర, రాజేంద్ర పాల్గొన్నారు.
- పాకాలలో మోగరాల జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల, అంబేద్కర్ భవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుమలత, అంబేద్కర్ భవన్ అధ్యక్షులు గుండ్లపల్లి ఆంజనేయులు సావిత్రిబాయి జీవిత విశేషాలను వివరించారు.
- వరదయ్యపాళెంలో మండల విద్యాధికారి సరస్వతి



వరదయ్యపాలెంలో...

ఆధ్వర్యంలో నిర్వహించారు. యుటియఫ్ గౌరవ అధ్యక్షులు రాజమోహన్ బాబు, అధ్యక్షుడు శశికుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్, శాంత, రాధారాణి పాల్గొన్నారు.
- కోటలో ఎన్‌బికెఆర్‌ఐఎస్‌టి డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. మెకానికల్ విభాగాధిపతి హెచ్.విక్రమ్‌కుమార్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.
- తిరుపతి మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కేశవులునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళల విద్యాభ్యాసం కోసం ఎన్నో కష్టాలను, అవమానాలను ఎదుర్కొని సమాజానికి దిక్సూచిగా నిలిచారన్నారు. పాఠశాలలోని 19 మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.
- ఎస్వీయూ క్యాంపస్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్య ద్వారానే అంతరాలు లేని సమాజాన్ని నిర్మించవచ్చని గుర్తించిన గొప్ప చదువుల తల్లి అని ప్రొఫెసర్ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ సమాజంలో నేటికీ చాలా మంది వివక్ష ఎదుర్కొంటూ విద్యకు దూరమవుతున్నారన్నారు. చదువు వ్యాపారమయం కావడంతో విద్యార్థులు కొనలేని పరిస్థితి ఉందన్నారు. నరేంద్ర, వినోద్, మౌనిక, పవన్, శివ, వీరేష్, వంశీ పాల్గొన్నారు.
- శ్రీకాళహస్తిలో బీసీ వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మిన్నల్‌రవి, నెమళ్లూరు బుజ్జి పాల్గొన్నారు.

మోకాళ్లపై మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపుమేరకు తిరుపతి జిల్లా గూడూరులో బుధ వారానికి పారిశుద్య కార్మికుల నిరవధిక సమ్మె 9వ రోజుకు చేరుకుంది. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని, కాలయాపన చేస్తే సమ్మెను ఉధతం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి రమణయ్య, సురేష్, కమిటి సభ్యులు సుబ్బమ్మ, పెంచలమ్మ, నారాయణమ్మ, పద్మమ్మ, మణెమ్మ, మణి, శ్రీనివాసులు, నాగరాజు పెంచలయ్య పాల్గొన్నారు.

గూడూరులో చీపురు పట్టిన మున్సిపల్ కమిషనర్

మున్సిపల్ కమిషనర్ చీపురు పట్టారు. బుధవారం వేకువజామున రైల్వే స్టేషన్ నుండి సంగం థియేటర్ సెంటర్ వరకూ కిలో మీటర్ పైగా ప్రధాన రహదారిపై చెత్తచెదారం తొలగించారు. ఆయనతోపాటు మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది 30 మంది వరకూ శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మిటికిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నారన్నారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. సమ్మెలో ఉన్న కార్మికులు

గూడూరులో చీపురు పట్టిన కమిషనర్
సూళ్లూరుపేటలో కార్మికులు x కౌన్సిలర్లు



సూళ్లూరుపేటలో కార్మికులతో కౌన్సిలర్ల వాగ్వివాదం

స్వచ్ఛందంగా వస్తున్న ప్రయివేటు కార్మికులకు అడ్డుపడకూడదన్నారు. సమ్మెకు తాము వ్యతిరేకం కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గూడూరులో తనతోపాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు రైల్వే స్టేషన్ నుండి సంగం థియేటర్ వరకూ ఒక కిలో మీటర్ వరకూ రోడ్డుపై ఉన్న చెత్తను ఊడ్చారన్నారు.

- సూళ్లూరుపేటలో కార్మికులు, కౌన్సిలర్లు మధ్య వాగ్వివాదం జరిగింది. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి,కమిషనర్ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్ పోలూరు పద్మలు బుధవారం సాయంత్రం బజారువీధిలో చెత్త తీయడానికి రావడంతో కార్మికులు అడ్డుకున్నారు. పోలీసుల సమక్షంలో మున్సిపల్‌కౌన్సిలర్లు, కార్మికుల మధ్య వివాదం చోటుచేసుకుంది. తమ సమస్యలు తీరే వరకూ ఇలాంటి పనులు చేయరాదని మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు అధికారులను అడ్డుకున్నారు. పోటీ కార్మికులను పెట్టరాదని షార్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సిఐటియు కార్యదర్శి కె.లక్ష్మయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, అధికారులు రెచ్చగొట్టడం సబబు కాదన్నారు. కార్మికులు పోరాడుతుంటే షార్ కాంట్రాక్టర్లు విచ్ఛిన్నం చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య, కె.సాంబశివయ్య, బి.పద్మనాభయ్య, చంద్రశేఖర్, సిహెచ్ సుధాకర్‌రావు, పి.మనోహరం, సుంకర అల్లెయ్య పాల్గొన్నారు.
- పుత్తూరు టౌన్‌లో కనీస వేతనం 26వేలివ్వాలని ఎఐటియుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డి.మహేష్ డిమాండ్‌చేశారు. హెల్త్ అలవెన్స్ ఆరువేలతో పాటు, కనీస వేతనం 20వేలివ్వాలన్నారు. అంకయ్య, యాకోబ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధే ధ్యేయం

తిరుపతి టౌన్ : తిరుపతి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టం చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ భవిషత్తులో తిరుపతి నగరం మరింత అభివద్ధి సాధించాలనే లక్ష్యంతో మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్, అధికారుల సహకారంతో ముందుకు వెలుతున్నామన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి



అభివద్ధికి కౌన్సిల్ సభ్యులు అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ఆదం రాధాకష్ణ రెడ్డి, ఆదం లీలావతి, దొడ్డారెడ్డి ప్రవళ్ళికా రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు పాల్గొన్నారు.

బకాయిలు ఎప్పుడిస్తారు..?

యుటిఎఫ్ 12 గంటల ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 18 వేల కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తిరుపతి మున్సిపల్ కార్యాలయం వద్ద 12 గంటల ధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ ధర్నాలో జిల్లాలోని వివిధ మండలాల నుండి విచ్చేసిన కార్యకర్తలు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు జిజే రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ధర్నా శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించినటువంటి ఎలాంటి బకాయిలను చెల్లించలేదని, ఆ రకంగా మొత్తం 18 వేల కోట్ల రూపాయలు ఈ రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఇప్పటికైనా స్పందించి వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండుచేశారు. ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్ డబ్బులకు లోన్లు పెడితే రెండు సంవత్సరాలుగా లోన్లు ఇవ్వడం లేదని, అదేవిధంగా ఏపీ జిఎల్ఐ పథకం కింద బాండ్లు మెచ్యూరిటీ అయి వాటి క్లేములు పంపితే రెండు సంవత్సరాలుగా అతీగతి లేదని, అలాగే సరెండర్ లీవ్స్ ఎన్క్యాష్ చేసుకున్నప్పటికీ ఇప్పటికీ దానికి సంబంధించిన బకాయిలు విడుదల కాలేదని ఈ రకంగా ప్రతి అంశంలోనూ ఉద్యోగ ఉపాధ్యాయులకు తాము దాచుకున్న డబ్బులు తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడి, తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్లక్ష్య ధోరణిని విడనాడి తక్షణం వారికి రావలసిన బకాయిలు చెల్లించేటట్లు చూడాలని ఆయన కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ ముత్యాల రెడ్డి మాట్లాడుతూ 11వ పిఆర్సికి సంబంధించి 7200 కోట్ల బకాయిలు ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సి ఉందని, అదే విధంగా ఏడు విడతల డిఏలు పెండింగ్లో ఉన్నాయని, ముఖ్యమంత్రి తన పాదయాత్ర సందర్భంగా ఎలాంటి బకాయిలు లేకుండా తక్షణము వారికి రావాల్సిన మొత్తాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా వేలకోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా ఉద్యోగ ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారని, ఆ రకంగా వెంటనే చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల మాట్లాడుతూ అవసరాలకు దాచుకున్న డబ్బులు కూడా పొందలేని పరిస్థితి సష్టించారని, ఇప్పటికైనా స్పందించి తక్షణం బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈనెల 9,10 తేదీలలో విజయవాడలో 36 గంటల మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నాయకులు చింతా మోహన్ ధర్నా కు మద్దతుగా



తిరుపతి పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

మాట్లాడుతూ సిపిఎస్ ను రద్దు చేస్తూ , ఓ పి ఎస్ ను పునరుద్ధరణ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెడతామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులు నాగార్జున , జనవిజ్ఞాన వేదిక నాయకులు రెడ్డప్ప , ఎస్ ఎస్ ఏ ఉద్యోగుల సంఘాల నాయకుడు మునికష్ణ , సిఐటియు నాయకులు కందారపు మురళి , సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు సందర్శించి సంఘీభావం తెలియజేసారు. ఈ 12 గంటల ధర్నాలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సూర్య ప్రకాష్, కందల శ్రీదేవి, కోశాధికారి రమేష్ నాయుడు, జిల్లా కార్యదర్శులు ఎన్ శేఖర్, హరిబాబు, మస్తానయ్య, దండు రామచంద్రయ్య, సుధీర్, బండి మధుసూదన్ రెడ్డి, సురేష్, కుమారస్వామి, పద్మజ, మోహన్ బాబు, వెంకటకష్ణ, ఓ విజయకుమార్ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎస్‌కె కార్మికుల నిరసన

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ధర్నా


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెలో భాగంగా బుధవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఆర్డీవో స్పందిస్తూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎస్ఎస్ఐ ఉద్యోగులను రెగ్యులర్‌చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సూర్యకుమారి, నాయకులు చరణ్, కంచి మాధవయ్య, ప్రదీప్‌కుమార్, మునిక్రిష్ణయ్య, సురేష్, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్, సీఎంలను కలిసిన ఎస్వీయూ వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, కులపతి ఎస్. అబ్దుల్ నజీర్‌ను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డిని, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖామాత్యులు బొత్స సత్యనారాయణను, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డిని గౌరవ పూర్వకంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి కలిసారు. విశ్వవిద్యాలయం అభివద్ధికి తాను నిరంతరం కషి చేస్తానని వారికి విసి తెలిపారు. విశ్వవిద్యాలయం ఉన్నతికి సహకరించాలని వారు ప్రభుత్వ పెద్దలను కోరారు. గవర్నర్, ముఖ్యమంత్రి , మంత్రి, ఛైర్మన్ సానుకూలంగా స్పందించి నట్లు విసి తెలిపారు.



రేపు డయల్ యువర్ టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుమల డయల్ యువర్ ఈవో కార్యక్రమం జనవరి 5వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

ఎస్వీ శిల్ప కళాశాలలో దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను సాయంత్రం కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు జనవరి 20వ తేదీ వరకు పెంచారు. ఏడాది కాలం శిక్షణ కలిగిన సర్టిఫికేట్ కోర్సులైన "సంప్రదాయ కళంకారి కళ", "శిల్పకళలలో ప్రాథమిక అంశాలు అనే కోర్సులను నూతనంగా ప్రవేశ పెట్టారు. వివరాల కోసం ప్రిన్సిపాల్, ఎస్వీ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప శిక్షణ కళాశాల, అలిపిరి రోడ్, బాలాజీ లింక్ బస్టాండ్ పక్కన, తిరుపతిలో గానీ, 0877-2264637, మొబైల్ నెం.9866997290 నంబర్లను గానీ సంప్రదించగలరు.

శెట్టిపల్లి లబ్దిదారులకు స్థలాలు చూపించాలి

తిరుపతి టౌన్ : ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో 2020లో పట్టాలిచ్చినా, ఇప్పటికీ స్థలాలు చూపించలేదని సిపిఎం బృందం డిఆర్‌ఒకు బుధవారం వినతిపత్రాలను అందించింది. సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వర్గ సభ్యులు కే వేణుగోపాల్ మాట్లాడుతూ స్థలాలిచ్చి, ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని వాగ్దానాలు చెప్పి నేటికీ సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకూ స్థలాలు కేటాయించలేదన్నారు శెట్టిపల్లిలోనే రెండు ప్రాంతాల్లో 41 ఎకరాల్లో 2,736 మందికి ఇస్తామని చెప్పి, ఆ తరువాత ఆ స్థలంలో సర్వేయర్ల ట్రైనింగ్ అకాడమీకి కేటాయించామని చెప్పారన్నారు. ఏళ్ల తరబడి నివసిస్తున్న వారికి ఎక్కడో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థలాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తుడా క్వార్టర్స్ చెన్నాయగుంట ప్రాంతాల్లోని స్థలాలను లబ్దిదారులకు కేటాయించాలన్నారు. నాయకులు బుజ్జి, నిమ్మనపల్లి మునిరత్నం, మోదిన్, బాదుల్లా, హమీద్, వాసు పాల్గొన్నారు.

'సెవెన్‌హిల్స్' వార్షికోత్సవ వేడుక

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

తిరుపతి మధురానగర్, రైల్వేకాలనీ, గోవిందనగర్‌లోని సెవెన్‌హిల్స్ విద్యాసంస్థల 35వ వార్షికోత్సవ వేడుక ప్రకాశం రోడ్డులోని మహతి ఆడిటోరియంలో కన్నుల పండువగా బుధవారం జరిగింది. ఎంఇఒ బాలాజీ, పూర్వ విద్యార్థులు కామాక్షి, రెడ్డి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కరస్పాండెంట్ హరినాథశర్మ, హెడ్‌మిస్ట్రెస్ హేమలత, ఛైర్మన్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో యుకేజీ చిన్నారులకు ఆహుతుల చేతుల మీదుగా కాన్వొకేషన్ వేడుక జరిగింది. వక్తలు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ముఖ్యమైనదని, మంచి నడవడిక, క్రమశిక్షణతోనే ఎంతో ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. అబ్దుల్‌కలాం, అంబేద్కర్, సత్యానాదెళ్ల, సివి రామన్ ఇలా ఎందరినో ఆదర్శంగా తీసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనులవిందుగా అలరించాయి.



భూ రీసర్వేను పటిష్టంగా చేపట్టండి

అధికారులకు జెసి ఆదేశం

ప్రజాశక్తి -రామచంద్రపురం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీ సర్వే ను పటిష్టంగా చేపట్టాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. బుధవారం మండలంలోని కే కే పురం లో జరిగే భూ రీ సర్వే ను ఆకస్మికంగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేలో రోజుకు ఎన్ని ఎకరాలు సర్వే చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో అక్రమాలకు తావు లేకుండా వేగవంతంగా పూర్తిచేయాలని భూ సర్వే సిబ్బందిని ఆదేశించారు. రీ సర్వేలో ఎక్కడైనా భూ వివాదాలు తలెత్తితే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు చేపడుతున్న క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కట్టు కింద వెంకటాపురంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలకు పౌష్టికాహారాన్ని సచివాలయ సిబ్బంది సక్రమంగా అందజేస్తున్నారా..? లేదా...? అనే విషయాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె చిన్న వెంకటేశ్వర్లు, భూ రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ ప్రేమ్ కుమార్, సర్వేర్ హేమాద్రి, గ్రామ రెవెన్యూ అధికారి సతీష్, కమ్యూనిటీ సర్వేలు మణి రైతులు పాల్గొన్నారు


భూరీ సర్వేను పరిశీలిస్తున్న జెసి శుభం బన్సల్

లింగ సమానత్వంను పెంపొందించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఇ కోనప్రభ స్థానిక శ్రీ కోదండరామ హైస్కూల్ లోని 9వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం లింగ వివక్షత పై అవగాహన నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోన ప్రభ మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు, పురుషు లతో సమానంగా అన్ని రంగా ల్లోనూ రాణిస్తున్నప్పటికీ ,తరతరా లుగా సమాజంలో పాతుకు పోయిన లింగ వివక్ష కారణంగా స్త్రీలు అనేక అవరోధాలు, అన్యాయాలు, హింసను ఎదుర్కొంటు న్నారన్నారు. గర్భస్థ దశ నుండి చనిపోయే వరకు జీవితంలో గల అన్ని దశల లోనూ స్త్రీలు లింగ వివక్షకు గురవుతున్నారన్నారు. లింగ వివక్షత పై సమగ్ర అవగాహన పెంపొందించుకొని లింగ సమానత్వ సాధన దిశగా విద్యార్థులు చైతన్యవంతం కావా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థులకు వివిధ అభ్యాసాల ద్వారా లింగ వివక్షత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర రీసర్చ్ అసిస్టెంట్స్ డాక్టర్ .ఎం .ఇంద్రాణి, వి.ప్రీతి, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు, విద్యార్థులు, తదితరులు పా ల్గొన్నారు.


లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్న డాక్టరు కోన ప్రభ

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- కెవిబిపురం: కెవిబి పురం మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఆరే డాక్టర్ హరీష్, మణికంఠ సూచనతో 240 ఆవులకు 55 గేదెలకు బుధవారం టీకాలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్పేడు వైసిపి మండల అధ్యక్షులు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ హరీష్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఉచిత టీకాలు వేసుకొని పశువులను గాలికుంటు వ్యాధి (అమ్మతల్లి) రాకుండా నివారించు కోవాలని ఈ వ్యాధి సోకితే పశువు పుట్టిగా దెబ్బ తింటుందని ముందుగానే ఈ టీకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆరే పశువుల డాక్టర్ హరిష్, మణికంఠ, గోపాల్ మిత్ర, అవసరం సురేష్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది మణీంద్ర, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

- విఆర్ఏల రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కె సుబ్బయ్య


సుబ్బయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఈ నెల 5వ తేదీన విఆర్ఏల సమస్యల పరిష్కారానికి మంగళగిరి లోని సి సియల్ఏ కార్యాలయం వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని విఆర్ఏల రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కొల్లపూడి సుబ్బయ్య పిలుపు నిచ్చారు. బుధవారం తిరుపతి జిల్లా గూడూరు లోని గ్రామ ఉద్యోగుల భవనంలో ఏర్పాటుచేసిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పట్లో విజయవాడ విఆర్ఏ ల దీక్ష శిబిరంలోకి వెళ్లిన తాను అధికారంలోకి రాగానే విఆర్ఏల సమస్యలు తక్షణమే పరిష్కరి స్తామని హామీ ఇచ్చి నాలుగున్నర సంవత్సరాలు అయినప్పటికి తక్షణమే విఆర్ఏలకు హామీలు నెరవేర్చాలని లేదంటే విఆర్ఏలు ఈనెల 5వ తేదీన మంగళగిరి లోని సిసియల్ఏ. కార్యాలయం వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు, జిల్లాల గౌరవాధ్యక్షులు అంగిరి పుల్లయ్య, పెంచల నరసయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షులు గోవింద స్వామి పాల్గొన్నారు.

చేనేత వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వండి: గుత్తి త్యాగరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని చేనేత సామాజిక వర్గాలకు చెందిన వారికి రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి తగిన గుర్తింపు ఇవ్వాలని రాజకీయ పార్టీలను రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం మీడియా విభాగ ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగరాజు కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేనేత ఉపకులములైన దేవాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని, ముందుకు వచ్చే రాజకీయ పార్టీకే మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా దేవాంగ చేనేత సంఘాలు కృష్ణయ్య, శేఖరయ్య, వెంకటరమణయ్య మునిస్వామి, మునిరాజా, రామయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎంపిడివో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని, విద్యార్థులు చదువులతో పాటు క్రీడలలోను రాణించాలని ఎంపీడీఓ సాయిలహరి తెలిపారు. బుధవారం ఆమె బుచ్చినాయుడు కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 'ఆడుదాం.. ఆంధ్ర బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చనున్న ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయా లన్నారు. మండలంలో ఆడుదాం.. ఆంధ్రా పోటీలకు సంబంధించి 190 క్రీడా జట్లు రిజిస్ట్రేషన్ల చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో త్రివిక్రమరావు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీ పరిధిలో అర్హులైన పింఛనుదారులకు కొత్తపట్నం పంచాయతీ ఉప సర్పంచ్, మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ చేతుల మీదగా పింఛన్లు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అల్లాబక్షు, మండల ఉపాధ్యక్షులు ఉప్పల. శేషయ్య గౌడ్ పాల్గొన్నారు.

నారాయణవనం: పెంచిన పెన్షన్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం పంపిణీ చేశారు. మూడువేల రూపాయలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంఈఓ ప్రభాకర్ రాజు, ఏవో గుణశేఖర్, ఏపిఎం మమత, తహశీల్దారు ప్రమీల, ఎంపీపీ దివాకర్ రెడ్డి. జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్ మండల కన్వీనర్ సొరకాయలు, డిసిసి డైరెక్టర్ ఊరప్ప. ఆర్‌డిఏకాంబరం, సర్పంచ్ శారద గణేష్ పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీర్ ఫోరం గ్రామపంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. బుధవారం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచి పి.లీలావతి, పంచాయతీ వైసిపి బాధ్యులు పీఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పెంచిన పింఛను 3 వేల రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి మల్లెమొగ్గల ఉమాపతి, వార్డు సభ్యులు భూదేవి, నాగమణి, ధనమ్మ, కుమారి, సతీష్, చెంగల రాయులు, సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పై పట్టు సాధించండి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - క్యాంపస్ : మేనేజ్మెంట్, కంప్యూటర్ సైన్స్ కోర్సులలోని విద్యార్థులు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్స్ పై పట్టు సాధించాలని రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టిపల్లి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని స్థానిక కొండారెడ్డి రాయలసీమ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ రిమ్స్ లో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్' అనే అంశంపై రెండు రోజుల అవగాహన సదస్సును బుధవారం ప్రారంభించారు.

'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి..'

ప్రజాశక్తి -నాగలాపురం: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధుజ ఆధ్వర్యంలో మండలంలోని తూర్పు పడమర హరిజనవాడ ,ఇందిరా నగర్, అరుంధతి వాడ, కొట్ట వాడు గ్రామపంచాయతీ, సంజీవి నగర్, రాజీవ్ నగర్,వినోభా నగర్, కాలం జేరి పరిసర ప్రాంతంలో 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి..' కార్యక్రమం బుధవారం నిర్వహించారు . ఈ సందర్భంగా సింధుజ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వాన్ని పారదోలాలని పిలుపునిచ్చారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: స్థానిక జీవకోన లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్య విద్యాలయ (ఆర్ఫన్ హోం ఫర్ గర్ల్స్) లోని బాలికలకు తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి .మునికృష్ణ నాయుడు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మునికృష్ణ నాయుడు మాట్లాడుతూ మనిషి జీవితంలో సేవకు మించిన సంతృప్తి లేదన్నారు. ఈరోజు మా క్లబ్ సభ్యులు లయన్ శ్రీ మబ్బు సూర్యనారాయణ రెడ్డి తను ఏర్పాటు చేసిన మబ్బు సూర్యనారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గర్ల్స్ హోమ్ కి సుమారు 15 వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర సరుకులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ,ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి ముబారక్ భాషా, ట్రెజరర్ వినోద్ వెంకటాచలం, సాకం కృష్ణమూర్తి ,రహంతుల్లా షరీఫ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గ్రామసభ ఏంటి?

- ప్రజా సమస్యలు పాలకులకు పట్టవా?
- టిడిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభను నిర్వహించాలని కానీ మంగళం గ్రామ పంచాయతీలో ప్రజలకుగానీ, ప్రతిపక్ష నాయకులకు గాని, కనీసం మీడియాకు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా గ్రామసభను నిర్వహించాల్సిన అవసరం ఏమిటని టిడిపి మంగళం గ్రామ పంచాయతీ అధ్యక్షులు సురేష్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మంగళం గ్రామ పంచాయతీలో సురేష్ నాయుడు గ్రామసభ నిర్వహణపై మీడియాతో మాట్లాడుతూ సమయ పాలన లేకుండా గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, వయోవృద్ధులు గంటలపాటు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకుంటోందన్నారు. మంగళం గ్రామపంచాయతీ పరిధిలో బి టి ఆర్ కాలనీ ఒకటో లైన్ నుండి తిరుమల నగర్ మార్గాన్ని కలుపుతూ నిర్మించిన సీసీ రోడ్డుకు కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తెలుగు గంగ నీటిని అందిస్తామని హామీ ఇచ్చినా నేటికి ఆ పనులు మొదలు కాలేదన్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన జగనన్న ఇంటి పట్టాలకు ఇప్పటి వరకు స్థలాలు చూపించలేదని, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని స్థానిక టిడిపి నాయకులతో కలిసి వినతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు రామాంజేరి మహేశ్వరి, వార్డు సభ్యులు నాగరాజు, నాయకులు గోపీనాథ్, పెరుగు భాస్కర్ రెడ్డి, ధర్మారెడ్డి, సురేష్ కుమార్, చలపతి, వెంకటరమణ, నగేష్, కిరణ్, అన్వర్, జనసేన నాయకుడు సాయి పాల్గొన్నారు.

జ్యోతిబస్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించండి..

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని టిడ్కో ఇళ్ల పక్కన జ్యోతి బస్‌నగర్ లో మౌలిక వసతులు, వస్తువులు ఎంజాయ్మెంట్ పట్టా ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ వెంకటేష్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఇచ్చారు కాని ఇల్లు కట్టుకొని కరెంటు బిల్లు, ఇంటి పన్ను , కరెంట్ బిల్లు కట్టుకుంటున్నారని, వారికి తాగునీరు లేక, ఎంజాయ్మెంట్ పట్టాలు ఇవ్వాలని, డ్రైనేజీ లేక రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని రాత్రిపూటల పాములు బెడద ఎక్కువగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌కి, పుత్తూరు తహశీల్దారుకి అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా వారిద్దరూ స్పందించి జ్యోతి బస్ నగర్ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య పాల్గొన్నారు.

తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలి

ఓజిలి : అనుభవ పట్టాదారులను భూమి దున్ననివ్వకుండా అడ్డుకుంటున్న ఓజిలి తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు రైతులతో కలిసి కలెక్టర్ కె వెంకటరమణారెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ మాచవరం, ముమ్మాయి పాలెం గ్రామాలకు చెందిన ఎస్సీ , ఎస్టీ, బీసీ పేదలకు సర్వే నెంబర్ 207లో 1986లో 51 మందికి అనుభవ పట్టాలను, డీకేటి పట్టాలు మంజూరు చేశారని, సాగు కోసం గతంలో బావులను తవ్వుకుని వ్యవసాయం చేస్తుండగా ఇటీవల తహశీల్దారు తన సిబ్బందితో కలిసి సాగుదాలను అడ్డుకొని సాగు చెయ్యనివ్వకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిపై గత రెండు నెలలుగా పలుమార్లు అర్జీలు ఇచ్చిన కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ , ఆర్డీవో కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సిపిఎం కార్యదర్శి శివకవి ముకుంద, మాచవరం గ్రామస్తులు గురవయ్య , కృష్ణయ్య , విశ్వనాథం, పొండయ్య పాల్గొన్నారు.


కలెక్టర్ కి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు, నాయకులు

గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో 9 మందికి మెడల్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయస్థాయి గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో డిసెంబర్ 28 నుంచి 31 వరకు నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు 13 మంది పాల్గొని అందులో 9 మంది మెడల్స్ సాధించడంతోపాటు జాతీయ స్థాయి తృతీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులు అందరినీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి అభినందించారు.

వీసీ శ్రీకాంత్ రెడ్డికి సత్కారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డిని ఎస్ వి యు ఉర్దూ విభాగం ప్రొఫెసర్స్, సిబ్బంది బుధవారం కలిసి, పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నజీర్‌అహమ్మద్ సాహెబ్, అమీరుల్లా సాహెబ్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహమ్మద్ అలీ, జంటైజ్ అహ్మద్, అంజలి అహ్మద్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి: సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 21వ వార్డు ఎన్టీఆర్ నగర్లో ఆమె పర్యటించారు. జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందనీ, సామాన్యులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లో అధికార పార్టీ అరాచకాలు ఎక్కువైపోయాయనీ, బొజ్జలను గెలిపిస్తేనే శాంతి భద్రతలు తిరిగి నెలకొంటాయని సూచించారు. టీడీపీ నేతలు రామకృష్ణ, మొహమ్మద్, ఖాదర్ బాషా, సాజిద్, ఆబిద్, ఆఫ్రిద్, మొహమ్మద్ రఫీ, సలర్ ఖాన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా: సర్పంచ్

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామంలో సర్పంచ్ కందాటి మోహన ప్రియ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు తెలియజేసిన మేరకు డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయాలని గ్రామ సభలో తీర్మానించామని వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం నవంబర్ 2వ తేదీ గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకున్న 49 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది, వాలంటీరుగ్రామస్తులు పాల్గొన్నారు.

'స్పీక్ ' ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి- నాగలాపురం : స్పీక్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం నాగలాపురం మండలంలోని రైతులందరికీ పంటలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రీజనల్ ఆఫీసర్ సి. గంగాధరం తెలిపారు. ఈ అవగాహన సదస్సును నాగలాపురం మండలంలోని టీ.ఆర్. ఆర్ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో రైతులకు వరి, వేరుశనగ , చెరుకు, మామిడి, పూలతోట పంటల పై ఎరువుల గురించి మందుల పిచికారి గురించి వివరిస్తూ యాజమాన్య పద్ధతులు, పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్లు వంటి సస్యరక్షణ చర్యలపై దిగుబడిని ఎలా సాధించాలో తెలుపు తారన్నారు. ఈ అవకాశాన్ని నాగలాపురం మండలంలోని చుట్టుపక్కల ఉన్న గ్రామ రైతులు విచ్చేసి పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ సదస్సుకు విచ్చేసిన రైతులందరికీ భోజనం ఏర్పాటు చేశామన్నారు.

ఆక్రమిత ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి- చిట్టమూరు: ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాల్లో అధికారులు బుధవారం శాశ్వత బోర్డులు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని ఆరూరు పెద్ద హరిజనవాడలో 1990లో ప్రభుత్వం లేఅవుట్‌వేసి పేదలైన ఎస్సీ ఎస్టీలకు ఇంటి స్థలాలు ప్రభుత్వం ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఎస్టీలకు మాత్రం 12 ప్లాట్లు మంజూరు చేశారు. ఆ ఇంటి స్థలాలలో యానాదులు ఎవరూ ఇల్లు నిర్మించుకోలేదు. ఇద్దరు వ్యక్తులు దీన్ని ఆసరగా తీసుకున్నారు. ఓ వ్యక్తి ఏకంగా ఎనిమిది ప్లాట్లను ఆక్రమించుకొని ఒక్క ప్లాట్‌లో ఇల్లు నిర్మించుకొని ఏడు ప్లాట్లకు బేరాలు చేశాడు. దీనిపై 'ప్రజాశక్తి'లో కథనం వచ్చింది. తర్వాత అప్పటి తహశీల్దారు రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన ట్రాన్స్‌ఫర్ మారిపోయిన సంగతి తెలుసుకుని హెచ్చరిక బోర్డులను తొలగించారు. మళ్లీ 'ప్రజాశక్తి'లో కథనం వచ్చింది. చిట్టమూరు తహశీల్దారు మునిలక్ష్మి స్పందించి సిబ్బందితో కలిసి తాత్కాలిక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అవి కొంత కాలా నికి పాడయ్యాయి. మళ్లీ దీనిపై కథనం రావడంతో తహశీల్దారు విజయలక్ష్మి స్పందించి వీఆర్వో, విఆర్ఎ సాయంతో పర్మినెంట్ బోర్డ్ ఏర్పాటు చేశారు. తహశీ ల్దారు మాట్లాడుతూ ప్రభు త్వ స్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే సీఎం లక్ష్యం

- 'స్వచ్ఛ ఆంధ్ర' ఛైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా మార్చడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ఆ మేరకు ఆరోగ్య శ్రీ కార్డు పరిమితి రూ.25 లక్షలకు పెంచారని ' స్వచ్ఛ ఆంధ్ర' ఛైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ పేర్కొన్నారు. రెండో పట్టణ పరిధిలోని జీ.ఎస్సార్ పురపాలక పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష 2 పాయింట్ జీరో కార్యక్ర మంలో పొణకా దేవసేనమ్మ పాల్గొన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. 'ఆరోగ్య సురక్ష'లో భాగంగా వైద్యశిబిరం నిర్వ హించారు. అవసరమైన వారికి అతిథుల చేతుల మీదుగా కళ్లజోళ్ళు అందించారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ గా మార్చేందుకు ఆరోగ్యశ్రీ కార్డుల పరిమితిని ఐదు నుండి 25లక్షలకు పెంచారని కొనియాడారు. ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆమె వివరించారు. అనంతరం పెంచిన పెన్షన్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, పురపాలక కమిషనర్ వెంకటేశ్వ ర్లు, ఆరోగ్య సురక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, నాయకులు బోమిడి శ్రీనివాసులు, సురేష్ రెడ్డి,రాఘవ రెడ్డి పాల్గొన్నారు.


అర్హులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న పొణకా దేవసేనమ్మ

పెద్దిరెడ్డిపై నిందలు తగవు: వైసీపీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ప్రచారాలు, తప్పుడు కథనాలు ప్రసారం చేస్తే ఊరుకునేది లేదని మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు హెచ్చరించారు. మండలంలో బుధవారం నిర్వహించిన వైసిపి నాయకుల సమావేశంలో భాగంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఓ ప్రధాన పత్రిక, యూట్యూబ్ ఛానల్ లో సత్యవేడు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డి చెప్పిన మాటల్ని పాటించానని, చెడ్డ పేరు వస్తే వారి ఇద్దరికే రావాలి.. తనకు కాదంటూ ఎమ్మెల్యే ఆదిమూలం సీఎం వద్ద వాపోయినట్లు కథనాలు వెలువడటంపై వారు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే అలాంటి ప్రకటనలు చేయలేదని వార్తలు ఎలా ప్రసారం చేస్తారని ప్రశ్నించారు. ఈ మేరకు నియోజక వర్గంలోని బిఎన్ కండ్రిగ మండలంలో సమావేశమైన వారు మాట్లాడుతూ 2019లో ఎన్నికల్లో ఆదిమూలం భారీ మెజార్టీతో గెలవడం వెనుక మంత్రి పెద్దిరెడ్డి కృషి ఉంద న్నారు. అప్పట్లో గ్రూపులుగా ఉన్న తమ నాయకులు అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి పెద్దిరెడ్డి ఆదిమూలం విజయానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాంటి పెద్దిరెడ్డిపై తప్పుడు కథనాలు రాసిన పత్రిక, యూట్యూబ్ ఛానల్‌పై చట్టపరంగా చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామని అప్పుడు నియోజకవర్గ అభ్యర్థిపై కీలక అభిప్రా యాన్ని అధిష్టానానికి తెలుపుతామని పేర్కొన్నారు. సురుటుపల్లి మాజీ ఛైర్మన్ బుజ్జిరెడ్డి, డాక్టర్ మునిరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సత్యవేడు, నాగలా పురం, వరదయ్యపాలెం, బిఎన్‌కండ్రిగ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తిరుపతి నగర శాఖ నూతన సంవత్సరం క్యాలెండర్ ను కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉద్యోగులు అందరూ సంతోషంగా ఉండాలని, ప్రభుత్వానికి ప్రజలకి వారధిగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలను అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తిరుపతి నగర శాఖ అధ్యక్షులు ఎస్ సురేష్ బాబు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో ఎప్పుడూ ముందుండే కలెక్టర్ కి రుణపడి ఉంటామని ఆయన ఆదరాభిమానాలు ఉద్యోగులపై ఎల్లప్పుడూ ఇలానే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బాలాజీ, సహ అధ్యక్షులు హిమగిరి, చెంచురత్నం, నారాయణ, ప్రేమలత, పద్మజ, హరికృష్ణ, నిమ్మల, రమణ పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్ బూత్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- రేణిగుంట: గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్నికల బూత్ కేంద్రాలను డిఎస్పి భవ్య కిషోర్, గాజుల మండ్యం సీఐ సుబ్బరాయుడు, ఎస్సై ధర్మారెడ్డి పరిశీలించారు. బుధవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని తండ్లం, విప్పమాను పట్టడు, సూరప్పకశం పోలింగ్ బూత్ కేంద్రాలను డి ఎస్ పి భవ్య కిషోర్ గాజుల మండ్యం సిఐ సుబ్బరాయుడు ఎస్ఐ ధర్మారెడ్డి పరిశీలించారు.

క్రైం న్యూస్

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : లారీ ఢీకొని విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పుత్తూరు రూరల్ మండల ఉత్తరపు కండ్రిగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సుధాకర్ కుమారుడు దివాకర్ (17) పట్టణంలోని స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఆరేటమ్మ ఆలయం వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. తలపై తీవ్ర గాయాలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరు కున్నారు. దివాకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురి అయిన వారిని అదుపులోకి తీసుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి తిరుపతి సిటీ: మద్యం మత్తులో నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం తిరుపతిలో చోటుచేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం మేరకు ..కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సత్యనారాయణ కాటన్ మిల్ సమీపంలోని చైతన్యపురంలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా వెల్డింగ్ షాపులో పనిచేస్తూ జీవనం సాగించే ఇతను. మంగళవారం ఫుల్లుగా మద్యం సేవించి, ఆటోనగర్ అంకాలమ్మ గుడి సమీపంలోని నీటి సంపులో ప్రమాదవశాత్తు పడటంతో ఊపిరాడక చనిపోయాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. తడ మండలంలోని పులివేంద్ర గ్రామ సమీపాన జాతీయ రహదారి పై బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గోవర్ధనగిరి చంద్రశేఖర్ (70) అలియాస్ సుబ్రమణి అను వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సమాచారం అందుకుని సంఘటనా స్థలం కు చేరుకుని మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదినారాయణ మృతికి నివాళులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం రామసముద్రంకు చెందిన ఐటిడిపి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మహేష్ తండ్రి ఆది నారాయణ మృతి విష యం తెలుసుకున్న టిడిపి నగరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ వారి ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మృతి వివరాలను అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఎ బాలాజీ, టిడిపి మాజీ రూరల్ అధ్యక్షులు కరుణ యాదవ్, మహేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలోని ఇంటర్ నెట్ గదిలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్ అయింది. మంటల వల్ల ఇంటర్నెట్ గదిలోని నెట్‌కు సంబంధించిన వివిధ పరికరాలు కాలి బూడిద అయ్యాయి. నెట్ సేవలకు అంతరాయం ఏర్పడడంతో కార్యాలయంలో ఆన్లైన్ సేవలకు బ్రేక్ పడింది. ఇంటర్నెట్ గదిలోని విద్యుత్ వైర్లు వల్ల విద్యుత్ షార్టు సర్క్యూట్ ఏర్పడిందని త్వరగా ఇంటర్ నెట్ సేవలను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ప్రారంభమైన సీనియర్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. విక్రమ్ టెన్నిస్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఈ పోటీలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక మహారాష్ట్ర, తెలంగాణ, ఒరిస్సా, బెంగాల్ జార్ఖండ్, తదితర రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు. గురువారం నుంచి మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయి.

బీసీల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం: నరసింహయాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిడిపి ఆవిర్భావం నుండి వెనుకబడిన తరగతులకు అత్యంత ప్రాధాన్యమిచ్చి బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా సముచిత స్థానాన్ని కల్పించిందని, బిసిల అభ్యున్నతి టిడిపికే సాధ్యమని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపితోనే బీసీల అభ్యున్నతి జరుగుతుందని, కానీ నేడు బీసీల ఓట్లతో గద్దెనెక్కిన వైసిపి సర్కార్ బీసీలను ఓటర్లుగా పరిగణిస్తూ వారి ఎదుగుదలకు ఏమాత్రం ఉపకరించలేదని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తూ బీసీల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి రెండు ప్రచార రథాలను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రారంభిస్తారన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రతి నియోజకవర్గంలో జరుగుతుందని, 45 రోజులు పాటు సాగే ఈ జయహో బిసి యాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయవచ్చన్నారు. యాత్రలో వచ్చిన అర్జీలతో స్పష్టమైన నిర్ణయాలు చేసి మేనిఫెస్టో రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు జగన్నాథం, ఆముదాల తులసీదాస్, సదాశివం, శ్రీరాములు, పెరుమాళ్ మధు, మధుసూదన్, గోవిందాచారి, మనోహర్ ఆచారి పాల్గొన్నారు.